నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శనివారం 24 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి | డీఈవో అశోక్


విద్యార్థి శివకృష్ణను అభినందిస్తున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి23 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్‌మేరీ పాఠశాలలో చదువుతున్న మసాదే శివకృష్ణ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుండగా, డీఈవో శుక్రవారం శివకృష్ణను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్‌లో రాష్ట్రస్థాయికి ఎదగడం గొప్ప విషయమని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని శివకృష్ణకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు,క్రీడల అధికారి మీనారెడ్డి, ప్రిన్సిపాల్ మేరికేవి, పీజీ హెచ్‌ఎం పూర్ణచంద్, శ్రీనివాస్, పీఈటీలు కడతల రాకేశ్, కిరణ్, అర్చన, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## వెల్గనూర్ పాఠశాలలో మాక్ జడ్పీ సమావేశం


మాక్ జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థిని

దండేపల్లి, ఫిబ్రవరి 23 : వెల్గనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రక్షిత మేడారం జాతర అనే అంశంపై మాక్(మోడల్ జడ్పీ సమావేశం)నిర్వహించారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలిగా, కలెక్టర్‌గా, అడిషనల్ కలెక్టర్‌గా, జడ్పీ సీఈవోగా, ఎమ్మెల్యే, ఎంపీగా, జడ్పీటీసీ సభ్యులుగా, ఎంపీపీగా విద్యార్థులు పాల్గొని మాక్ జడ్పీ సమావేశం నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలు, ఆర్టీసీ బస్సులు, వివిధ వసతులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్రమాల శ్రీరంగం

**రంగంపేటలో వెలసిన 8 ఎకరాల వెంచర్**

- చిన్నకుంట చెరువు కట్ట మీదుగా అనధికార రోడ్డు
- డీటీసీపీ లే-అవుట్ అంటూ విక్రయాలు
- ఇప్పటి వరకు అసలు దరఖాస్తు కూడా చేసుకోని వైనం
- చోద్యం చూస్తున్న మున్సిపల్, ఇరిగేషన్ శాఖ అధికారులు


రంగంపేట శివారులో వెలసిన అక్రమ వెంచర్

మంచిర్యాల, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రంగంపేటలో అక్రమ వెంచర్ వెలసింది. మంచిర్యాల మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల కండ్లు కప్పి శ్రీరంగం హిల్స్ పేరిట లే-అవుట్ ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తున్నది. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని రంగంపేట శివారులో సర్వే నంబర్ 58, 68, 69లోని 8 ఎకరాల్లో ఈ లే-అవుట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడికి వెళ్లేందుకు రంగంపేట చిన్నకుంట చెరువు కట్ట మీదుగా రోడ్డు వేశారు. ఇరిగేషన్‌శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఓ పక్కన కట్టను తొలిచి వెంచర్ దాకా సుమారు రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు వేశారు. చెరువు పక్కనుంచి వెంచర్ వరకు వెళ్లే ఎడ్లబండ్ల బాట(ప్రభుత్వ భూమిని)ను 30 ఫీట్ల రహదారిగా మార్చేశారు. స్థానికంగా ఇది పెద్ద చర్చనీయాంశం అయినప్పటికీ అధికారులు తమకు ఏం తెలియదని సమాధానాలు చెబుతున్నారు. అధికారులకే తెలిసే ఇదంతా జరిగిందని స్థానికులు ఆరోపిస్తుంటే.. మీరు చెప్పే దాకా తమ దృష్టికి రాలేదని ఆయా శాఖల అధికారులు తప్పించుకునే ప్రయత్నాలు చేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది. గతంలో జైపూర్ మండలంలో అవర్ డ్రీమ్ ప్రాజెక్ట్ పేరుతో ఇండ్లు నిర్మించిన సంస్థే.. ఇక్కడ శ్రీరంగం హిల్స్ పేరుతో సుమారు 150 ప్లాట్‌లతో ఈ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న రీతిలో ‘అవర్ డ్రీమ్’ అనే పేరు చెప్పి ఆ సంస్థ నిర్వాహకులు అక్రమాలకు తెరలేపారనేది స్పష్టంగా తెలుస్తున్నది.

### మూడెకరాలకు నాలా కన్వర్షన్..

మున్సిపాలిటీ పరిధిలోని ఏ లే-అవుట్‌కైనా టీపీ(టెంటిటేటివ్ లే-అవుట్ పర్మిషన్) తీసుకోవాలి. అది వచ్చాకే ప్లాట్‌లు, రోడ్లు ఇతర డెవలప్‌మెంట్ పనులు చేసుకోవాలి. కానీ, శ్రీరంగం హిల్స్ విషయంలో అలాంటి నిబంధనలేవీ పాటించలేదు. డీటీసీపీకి వెళ్లామని సదరు సంస్థ నిర్వాహకులు చెబుతున్నప్పటికీ మున్సిపాలిటీలో కనీసం డీటీసీపీ కోసం దరఖాస్తు కూడా చేసుకోలేదని తెలిసింది. ‘నమస్తే తెలంగాణ’ పరిశీలనలో ఈ 8 ఎకరాల్లో మూడు ఎకరాలు మాత్రమే నీలి శ్రీనివాస్( సంస్థ నిర్వాహకుల్లో ఒకరు) పేరుపై నాలా కన్వర్షన్ చేసుకున్నారు. సర్వే నంబర్ 68/3లో 0.24 ఎకరాలు, 68/4లో 2.16 ఎకరాలు నాలా కన్వర్షన్ చేసుకున్నట్లు రికార్డులు చూపిస్తున్నారు. మిగిలిన 5 ఎకరాల్లో ఎకరన్నర వ్యవసాయభూమి నీలి శ్రీనివాస్ పేరు మీద ఉండగా, మిగిలిన భూమి వేరే వ్యక్తుల పేరుపై రెవెన్యూ రికార్డుల్లో ఉంది. కానీ ప్రభుత్వానికి పన్ను కట్టకుండా అధికారులను మేనేజ్ చేసి డీటీసీపీ అప్రువల్ రాకుండానే రిజిస్ట్రేషన్లు చేయించేందుకు సదరు సంస్థ నిర్వాహకులు సిద్ధమైనట్లు తెలుస్తున్నది. రంగంపేట చిన్నకుంట చెరువు పునరుద్ధరణకు కేసీఆర్ సర్కార్ 2017లో నిధులు ఇచ్చింది. అప్పుడు కట్టపై పగుళ్లకు మరమ్మతులు చేసి బలోపేతం చేశారు. ఆ తర్వాత ఈ చెరువు అభివృద్ధికి ఎలాంటి నిధులు రాలేదని ఇరిగేషన్ శాఖ ఏఈ గౌతమ్ తెలిపారు. కొన్ని రోజుల క్రితం ఈ చెరువు కట్టపై నుంచి శ్రీరంగం టౌన్‌షిప్ వరకు 30 ఫీట్ల రహదారి ఏర్పాటు చేసిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. పోనీ.. మున్సిపాలిటీ అధికారులు ఏమైనా ఇందుకు అనుమతులు ఇచ్చారా.. అంటే అదీ లేదు. సాధారణంగా మున్సిపాలిటీ సరిహద్దుల్లో ఎవరైనా ఇండ్లు కట్టుకుంటే వారి ఇంటి వరకు రోడ్డు వేయడానికి సవాలక్ష రూల్స్ చెప్పే మున్సిపల్ అధికారులు. చెరువు కట్ట మీద నుంచి రోడ్డు వేసినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. అక్కడికి వెళ్లి చూస్తే కట్ట మీద నుంచి కొత్త రోడ్డు వేశారని చిన్న పిల్లోడు కూడా చెప్తాడు. కానీ, అధికారులు మాత్రం ఇప్పటి వరకు ఆ విషయం తమ దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో, జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఇంత అక్రమ బాగోతం నడుస్తున్నా అధికారులు తెలియకపోవడం ఏమిటనేది అర్థం కావడం లేదు. జిల్లాలో ఇప్పటికే 140కిపైగా అక్రమ లే-అవుట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వాటిని అరికడుతామని చెబుతూనే.. మరోవైపు అనధికార లే-అవుట్లను ప్రోత్సహిస్తున్నారని, లేకపోతే జిల్లా కేంద్రంలో 8 ఎకరాల్లో భారీ వెంచర్ పడిన విషయం అధికారులకు తెలియకపోవడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి శ్రీరంగం టౌన్‌షిప్‌నకు పర్మిషన్ ఉందా..లేదా అనే విషయాన్ని నిగ్గుతేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. మరి ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. ఈ విషయమై మంచిర్యాల మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ శ్యాంసుందర్‌ను వివరణ కోరగా.. శ్రీరంగం హిల్స్‌కు సంబంధించి డీటీసీపీ అప్రూవల్ కోసం ఇప్పటి వరకు ఎలాంటి దరఖాస్తు రాలేదన్నారు. చెరువు కట్టను ఆక్రమించి రోడ్డు వేయడం అనేది ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుందని, దానికి మాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. టీపీ పర్మిషన్ లేకుండా ప్లాట్లు ఏర్పాటు చేసుకోడానికి వీలు లేదన్నారు. అలాంటివేమైనా ఉంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

> **డీటీసీపీకి వెళ్లాం..**
> **త్వరలో రిజిస్ట్రేషన్లు చేస్తాం**
>
> *డీటీసీపీ పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాం. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు కావడం లేదు. అధికారులతో మాట్లాడి త్వరలోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మొదలు పెడతాం. సర్వే నంబర్ 58, 68, 69లో 150 ప్లాట్లు ఏర్పాటు చేశాం. గజానికి రూ.6900 చొప్పున విక్రయిస్తున్నాం. మిగిలిన విషయాలు తర్వాత చెబుతాం.*
> **- నీలి శ్రీనివాస్, శ్రీరంగం హిల్స్ సంస్థ నిర్వాహకులు**


రంగంపేట చిన్నకుంట చెరువు కట్ట మీదుగా వేసిన రోడ్డు


వెంచర్‌కు వెళ్లేందుకు నిర్మించిన 30 ఫీట్ల రోడ్డు
(ఇది వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఉన్న ఎండ్లబండి బాట)


మంచిర్యాల గోదావరి తీరంలో భక్తుల సందడి

మంచిర్యాలలో సమ్మక్క-సారక్కలకు మేకతో మొక్కుతున్న భక్తులు

సీసీసీ నస్పూర్ : మొక్కులు చెల్లించుకుంటున్న సింగరేణి అధికారులు, కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


మంచిర్యాలలో బంగారం (బెల్లం) ఎత్తుకొని వస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు


మంచిర్యాలలో అమ్మవారికి మొక్కుతున్న యువతి

# వరాల తల్లులకు జేజేలు

**మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో వైభవంగా సమ్మక్క-సారలమ్మ జాతర**

- గద్దెలపై కొలువుదీరిన అమ్మవార్లకు భక్తుల మొక్కులు
- నిలువెత్తు బంగారంతో ప్రత్యేక పూజలు
- పలుచోట్ల దర్శించుకున్న ప్రముఖులు
- ఆయాచోట్ల పోలీసు భారీ బందోబస్తు



*ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో సమ్మక్క-సారలమ్మ జాతర వైభవంగా సాగుతున్నది. తల్లులిద్దరూ గద్దెలపై కొలువుదీరగా.. భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఆయాచోట్ల బారులు తీరి అమ్మవార్లను దర్శించుకొని జేజేలు పలికారు. ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, నిలువెత్తు బంగారం( బెల్లం) సమర్పించి కుటుంబ సభ్యులంతా బాగుండాలని వేడుకున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు 75 కిలోల ఎత్తు బంగారం (బెల్లం)అమ్మవార్లకు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు-రాజకుమారి దంపతులు, కుమారుడు, బీఆర్‌ఎస్ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు మొక్కులు తీర్చుకున్నారు. లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరి తీరాన లక్షెట్టిపేట సీనియర్ సివిల్ జడ్జి అర్పితా మారం రెడ్డి, శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం రఘుకుమార్, డీజీఎం పర్సనల్ అరవిందరావు సమ్మక్క-సారలమ్మకు పూజలు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.*


అమ్మవార్లకు మొక్కుతున్న భక్తులు


## ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

**రిటర్నింగ్ అధికారి దత్తు**


మాట్లాడుతున్న చెన్నూర్ తహసీల్దార్ మల్లికార్జున్, పాల్గొన్న ఆర్వో దత్తు.

చెన్నూర్, ఫిబ్రవరి 23 : పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిడం దత్తు అన్నారు. చెన్నూర్‌లో ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ టీమ్‌లు, సెక్టోరల్ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయా విభాగాల్లో నియమితులైన అధికారులు ఎన్నికలు విజయవంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. ఏవైనా సందేహాలుంటే తమను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని మండలాల తహసీల్దార్లు మల్లికార్జున్, సదానందం, చంద్రశేఖర్, వనజారెడ్డి, మహేంద్రనాథ్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, 63 మంది ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధారి జాతర షురూ..


దేవతా మూర్తులను గోదావరి జలాలతో శుద్ధి చేస్తున్న పూజారులు, నాయక్‌పోడ్ వంశస్తులు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 23 : క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 9వ వార్డులోగల బొక్కలగుట్ట పంచాయతీలోని గాంధారిఖిల్లా మైసమ్మ జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు సదర్ల భీమన్న గజాల (కర్ర విగ్రహాలు) వద్ద ప్రధాన పూజారులు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయక్‌పోడ్ గిరిజన పూజారులు, సంఘం నాయకులు తప్పెటగూళ్లు, పిల్లనగ్రోవి వాయిద్యాల నడుమ విగ్రహాలను ఊరేగింపుగా మంచిర్యాల సమీపంలోని గోదావరి నదికి తీసుకెళ్లారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మాడావి గంగధర్ బెల్లంపల్లి చౌరస్తాలో సాగనంపారు. గోదావరి పవిత్ర జలాలతో విగ్రహాలను శుద్ధి చేశారు. నైవేద్యం వండి దేవతలకు సమర్పించారు. తిరిగి సాయంత్రం బొక్కలగుట్ట సదర్ల భీమన్న వద్దకు చేర్చారు. రాత్రి సంప్రదాయ పాటలతో అలరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. 24న నాయక్‌పోడ్ సంప్రదాయ కళారూపాలు, లక్ష్మీదేవర నృత్య ప్రదర్శన ఉంటుందని, 25న నిర్వహించే ప్రజాదర్బార్‌కు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరవుతారని నాయకపోడ్ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొక్కలగుట్ట సర్పంచ్ బొలిశెట్టి సువర్ణ, క్యాతనపల్లి మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ పారిపెల్లి తిరుపతి, ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు భార్గవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, జిల్లా ప్రధాన కార్యదర్శి బైర్నేని లక్ష్మణ్, ఆలయ పూజారులు మైసయ్య, రొడ్డ పెద్ద రాజం, వైస్ చైర్మన్ రమేశ్, కాసిపేట ఎంపీపీ రొడ్డ లక్ష్మి, మాజీ ప్రధాన కార్యదర్శి గంజి రాజన్న, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


నస్పూర్‌లోని పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


నందిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే కోవలక్ష్మి

## లాస్యనందితకు నివాళి

సీసీసీ నస్పూర్/ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందితకు నస్పూర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, నస్పూర్ పట్టణ పార్టీ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్యతో కలిసి లాస్యనందిత చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం దివాకర్‌రావు మాట్లాడుతూ చిన్న వయసులోనే లాస్యనందిత ఎమ్మెల్యేగా గెలుపొందారని, ఆమె మరణించడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా లాస్యనందిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, నాయకులు వంగ తిరుపతి, గోగుల రవీందర్‌రెడ్డి, గట్టు శ్రీనివాస్, పెరుమాళ్ల జనార్ధన్, మండల క్రాంతి, అమృత రాజ్‌కుమార్, మధూకర్ పాల్గొన్నారు.

### ఇంటికెళ్లి పరామర్శించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23 : ఎమ్మెల్సీ కవిత, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి సికింద్రాబాద్‌లోని లాస్య నందిత ఇంటికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. నందిత ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు కోవలక్ష్మి వారు తెలిపారు.

## వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

రెబ్బెన, ఫిబ్రవరి 23 : గంగాపూర్‌లో కొలువైన శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది. భక్తులు వేలాదిగా తరలిరాగా, గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. వేదపండితులు శ్రీనివాసాచార్యులు, వేణుగోపాలాచార్యులు, మురళీధరచార్యులు, రామకృష్ణచార్యులతో పాటు ఆలయ ప్రధాన అర్చకుడు గణేశ్‌పంతులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. టీటీడీ ప్రతినిధి గొల్లపల్లి సత్యనారాయణ పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, కంకణాలు, పుస్తకాలు తీసుకురాగా, బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ ఆలయం వరకు నెత్తిపై పెట్టుకొని వచ్చి స్వామి వారికి సమర్పించారు. సీఎఫ్‌వో వేణుగోపాల్‌గుప్తా, ఆలయ ఈవో బాపురెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. సీఐలు చిట్టిబాబు, శ్రీనివాస్, సతీశ్, ఎస్‌ఐలు చంద్రశేఖర్, రమేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు స్వామి వారిని దర్శించుకున్నారు. పలు వ్యాపార సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

### నేడు రథోత్సవం

శనివారం వేంకటేశ్వరస్వామి జాతర, రథోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.15 గంటలకు రథంపై ఉత్సవ విగ్రహాలను ఊరేగించనున్నారు.


వేంకటేశ్వరస్వామి కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న జీఎం రవిప్రసాద్